# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

బుధవారం / 28.02.2024


# మెగా డీఎస్సీపై రేవంత్ కీలక ప్రకటన



**తెలంగాణ వీణ , హైదరాబాద్** : ఆరు గ్యారెంటీల్లో భాగంగా.. మరో రెండు పథకాలను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి.. నిరుద్యోగులు ఎగిరి గంతేసే వార్త వినిపించారు. సెక్రటేరియట్‌లో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలను ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి.. జన జాతర పేరుతో చేవెళ్లలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సభలో ప్రసంగించిన రేవంత్ రెడ్డి.. మెగా డీఎస్సీపై కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ గురించి ప్రస్తావిస్తూ.. త్వరలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తామంటూ రేవంత్ రెడ్డి ప్రకటించారు.అయితే.. గత ప్రభుత్వంలో నిరుద్యోగుల గురించి కేసీఆర్ ఏరోజూ ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేవలం తన కుటుంబసభ్యులకు మాత్రమే ఉద్యోగాలు ఇప్పించుకున్నాడంటూ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తన కూతురుని నిజామాబాద్‌లో ఓడగొడితే.. ఆరు నెలలు తిరగక ముందే మళ్లీ ఎమ్మెల్సీ పోస్టు ఇచ్చారని, ఇక వినోద్ రావును కూడా ప్రజలు తిరస్కరిస్తే ప్రణాళికా సంఘం ఉపాధ్యాకుడిగా నియమించారని.. ఇక సంతోష్ రావును రాజ్యసభకు పంపించారంటూ వివరించారు. కానీ.. పదేళ్లుగా పెళ్లిళ్లు చేసుకోకుండా చదివితే.. నోటిఫికేషన్లు లేక, ఉద్యోగాలు రాకా.. చెట్లకు ఉరేసుకుని చనిపోతుంటే ఏరోజూ కేసీఆర్ కానీ, కేసీఆర్ కానీ, కవిత గానీ స్పందించలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు రేవంత్ రెడ్డి.కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే 25 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మార్చి మొదటి వారంలో మరో ఆరేడు వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు అందిస్తామని తెలిపారు. త్వరలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కూడా వేసి.. భారీ స్థాయిలో ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసి.. ప్రతి పల్లెకు, తండాకు, గూడెంకు పంతుళ్లను పంపిస్తామని హామీ ఇచ్చారు.బీఆర్ఎస్ హయాంలో పోటీ పరీక్షల ప్రశ్నా పత్రాలు లీకవుతుంటే.. జిరాక్స్ సెంటర్లలో అమ్ముకుంటుంటే.. కేసీఆర్ పట్టించుకోలేదని దుయ్యబట్టారు రేవంత్ రెడ్డి. కానీ.. తమ ప్రభుత్వం వచ్చాక వాళ్లందరినీ జైళ్లకు పంపించామని తెలిపారు. కోర్టులో ఉన్న కేసులన్నింటినీ పరిష్కరించి.. ఉద్యోగాల భర్తీకి ఉన్న అడ్డంకులు తొలగించేలా చొరవ తీసుకున్నామని రేవంత్ రెడ్డి వివరించారు. నిరుద్యోగుల కలలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తామని.. సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.


# వైసీపీకి షాక్.. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి రాజీనామా



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో** : వైఎస్సార్‌సీపీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ప్రకాశం జిల్లా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇవాళ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.. భవిష్యత్ కార్యాచరణపై అనుచరులతో చర్చించి త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తాను అంటున్నారు. ఇటీవల పరిణామాలు తనను ఎంతగానో బాధించాయని.. అనివార్య పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీని వీడాల్సి వస్తోందన్నారు. తన కుమారుడు రాఘవరెడ్డిని ఎన్నికల్లో పోటీలో ఉంచాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఎంతో బాధతో పార్టీకి రాజీనామా చేస్తున్నానని.. అన్ని విషయాలను త్వరలోనే వెల్లడిస్తానన్నారు.33 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని.. 11 సార్లు చట్టసభలకు పోటీ చేశానన్నారు. ప్రకాశం జిల్లాలో మాగుంట అంటే.. ఒక బ్రాండ్ ఉందన్నారు. తమ కుటుంబానికి అహం లేదని.. ఉన్నది ఆత్మాభిమానం మాత్రమే అన్నారు. జగన్‌ను తమ కుటుంబసభ్యుడిగా భావించామని.. ఐదేళ్లు సహాయ సహకారాలు అందించిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఎన్నికల బరిలో ఉండే మాగుంట కుటుంబాన్ని ప్రకాశం జిల్లా ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు.వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఒంగోలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని దూరంపెట్టింది. ఒంగోలు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని సీఎం జగన్ తెరపైకి తెచ్చారు. ఈ పరిణామాలపై మాగుంట శ్రీనివాసులు రెడ్డి అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు మార్చి మొదటి వారంలో మాగుంట టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది.మాగుంట రాజీనామాతో కొద్దిరోజుల్లోనే ఆరుగురు ఎంపీలు వైఎస్సార్‌సీపీ వీడారు. వీరిలో ఐదుగురు లోక్‌సభ సభ్యులు, ఒక రాజ్యసభ ఎంపీ ఉన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, సంజీవ్‌కుమార్ (కర్నూలు), లావు శ్రీకృష్ణదేవరాయలు (నరసరావుపేట), రఘురామకృష్ణరాజు (నర్సాపురం)తో పాటు రాజ్యసభ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు.

# తాప్సీకి కాబోయేవాడు పెద్ద ఆటగాడే..

**తెలంగాణ వీణ , సినిమా** : 'ఝుమ్మంది నాదం' సినిమాతో వెండితెరకి పరిచయమైంది తాప్సీ. ఆ తరువాత నెమ్మదిగా బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక ఇప్పుడు టాలీవుడ్ వైపే తొంగి చూడటం లేదు. అయితే తాజాగా త్వరలోనే తాప్సీ పెళ్లి అంటూ తెగ వార్తలు వస్తున్నాయి. 10 ఏళ్లుగా ప్రేమలో ఉన్న తన బాయ్ ఫ్రెండ్‌ను తాప్సీ పెళ్లి చేసుకోబోతుందని తెలుస్తోంది. మరి వీరి వివాహం ఎప్పుడు, ఎక్కడ జరగబోతుందంటే?



### బ్యాడ్మింటన్ ఆటగాడు

డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ 'మథియాస్ బో'ని తాప్సీ వివాహం చేసుకోబోతుంది. దాదాపు పదేళ్లుగా వీరి లవ్ స్టోరీ నడుస్తుంది. దీంతో మార్చిలో వివాహం చేసుకోవాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారట. తాప్సీ – మాథియాస్ పెళ్లి మార్చి నెలాఖరులో జరుగుతుందని సమాచారం. రాజస్థాన్‌లో ఉదయ్‌పూర్‌లో ఘనంగా పెళ్లి చేసుకునేందుకు ప్లాన్ చేశారట. ఈ పెళ్లికి ఇరు కుటుంబాల సభ్యులతో పాటు స్నేహితులు హాజరు కానున్నారు. అయితే బాలీవుడ్ సెలెబ్రిటీలను మాత్రం చాలా తక్కువ మందినే ఆహ్వానించారని తెలుస్తోంది. సిక్కు, క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం వీరి పెళ్లి జరగబోతుంది.

### అలా మొదలైంది

తాప్సీ లవ్ ఎఫైర్ గురించి చాన్నాళ్లుగా సోషల్ మీడియాలో వార్తలు వస్తూనే ఉన్నాయి. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో దీనిపై తాప్సీ క్లారిటీ ఇచ్చేసింది. బాలీవుడ్‌లో తాను అడుగుపెట్టిన సమయంలో మథియాస్‌తో పరిచయమైనట్లు తాప్సీ చెప్పింది. తన తొలి సినిమా ఛష్మే బద్దూర్ (2013) షూటింగ్‌లో తనని కలిశానని, ఆ తర్వాత పరిచయం ప్రేమగా మారినట్లు చెప్పుకొచ్చింది. ఈ 10 ఏళ్ల రిలేషన్‌లో మథియాస్‌తో చాలా సంతోషంగా ఉన్నట్లుగా తాప్సీ తెలిపింది.

2013లో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన తాప్సీకి 'పింక్' చిత్రం బ్రేక్ ఇచ్చింది. లెజెండ్ అమితాబ్ బచ్చన్ లాయర్‌గా యాక్ట్ చేసిన ఈ సినిమాలో తాప్సీ యాక్టింగ్ ఇరగదీసింది. ఈ సినిమానే తెలుగులో 'వకీల్ సాబ్'గా రీమేక్ చేసిన సంగతి తెలిసిందే. ఇక పింక్ తర్వాత బాలీవుడ్‌లో తాప్సీ హవా మొదలైంది. వరుసగా క్రేజీ ఆఫర్లతో స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఇక ఇటీవల బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ 'డంకీ' సినిమాలో హీరోయిన్‌గా నటించింది తాప్సీ. రాజ్ కుమార్ హిరానీ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి విజయం అందుకుంది. ఇలా సౌత్ సినిమాలను పక్కనపెట్టేసి వరుసగా బాలీవుడ్ చిత్రాలతో యమా బిజీగా ఉంది ఈ బ్యూటీ. ఇక ఇప్పుడు మార్చి నెలాఖరులో పెళ్లి పీటలెక్కనుంది. ఈ వార్తలు చూసిన ఫ్యాన్స్ తాప్సీకి అడ్వాన్స్ విషెస్ చెబుతున్నారు.


# మార్చి 4, 5 తేదీల్లో తెలంగాణకు ప్రధాని

**తెలంగాణ వీణ , హైదరాబాద్** : వచ్చే ఎన్నికల్లో 370 స్థానాల్లో గెలుపు ఖాయమని లోక్‌సభలోనే ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే టార్గెట్‌తో కమలం పార్టీ సార్వత్రిక సమరానికి సమాయత్తమవుతోంది. తెలంగాణలోని మొత్తం 17 సీట్లలో కాషాయ జెండా ఎగురువేయాలనే సంకల్పంతో బీజేపీ ముందుకు సాగుతోంది. ఇప్పటికే రాష్ట్ర బీజేపీ నేతలు.. విజయ సంకల్ప యాత్ర పేరుతో ఎన్నికల ప్రచారానికి తెరతీశారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన ఖరారయ్యింది. వచ్చే నెల 4, 5 తేదీల్లో రెండు రోజులపాటు మోదీ పర్యటన కొనసాగనుంది. ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో మోదీ పర్యటిస్తారు.వాస్తవానికి మార్చి 4 న కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించాల్సి ఉంది. అయితే ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆయన షెడ్యూల్ రద్దయింది. ఇక, మోదీ మార్చి 4న ఉదయం ఢిల్లీ నుంచి విమానంలో మోదీ నాగ్‌పూర్ చేరుకుని.. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో ఆదిలాబాద్ జిల్లాకు చేరుకుంటారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆదిలాబాద్‌లో నిర్వహించే బహిరంగసభలో ప్రధాని పాల్గొంటారు. అనంతరం ఆ రోజు 4న రాత్రి హైదరాబాద్‌కు చేరుకుని రాజ్‌భవన్‌లో బస చేశారు.మర్నాడు ఉదయం మార్చి 5న సంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తారు. సంగారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, అక్కడ బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత ఢిల్లీకి తిరుగుపయనమవుతారు. ఈ పర్యటనలో భాగంగా నాందేడ్– అఖోలా జాతీయ రహదారిని మోదీ జాతికి అంకితం చేసే అవకాశం ఉంది.కాగా, ప్రస్తుతం రెండు రోజులుగా తమిళనాడులో పర్యటిస్తున్న ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహిస్తున్నారు. అంతకు ముందు తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో పర్యటించిన ఆయన అక్కడ.. దేశంలోనే అతి పొడవైన కేబుల్ బ్రిడ్జ్ సుదర్శన సేతును ప్రారంభించారు.



# రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం జగన్

**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో** : ఏపీ సీఎం జగన్ వైఎస్సార్ రైతు భరోసా పథకంలో భాగంగా రైతుల ఖాతాలోకి నగదు బదిలీ చేశారు. నేడు రైతు భరోసా నిధులు రూ.1,078 కోట్లు విడుదల చేసిన సీఎం జగన్... రైతు బాగుంటేనే అందరూ బాగుంటారని అన్నారు. గత 57 నెలల్లో రైతు భరోసా రూపంలో రూ.34,288 కోట్లు అందించామని వెల్లడించారు. ఈ పథకం కింద 53.58 లక్షల మంది లబ్ది పొందుతున్నారని సీఎం జగన్ వివరించారు. తమది రైతు ప్రభుత్వం అని స్పష్టం చేశారు. ఏపీలో ఒక హెక్టారు లోపు భూమి ఉన్న రైతులు 70 శాతం మంది ఉన్నారని, అర హెక్టారు లోపు భూమి ఉన్న రైతులు 50 శాతం మంది ఉన్నారని... అలాంటి రైతులకు తాము అందించిన పెట్టుబడి సాయం ఎంతో ఉపకరించిందని తెలిపారు. ఇక, అర్హులైన రైతులకు సున్నా వడ్డీ రాయితీ సొమ్మును కూడా విడుదల చేసినట్టు సీఎం జగన్ వెల్లడించారు. 10.79 లక్షల రైతులకు సున్నా వడ్డీ రాయితీ కింద ఇవాళ రూ.215.98 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు.




# న్యూజిలాండ్‌లో కన్నప్ప టీం

**తెలంగాణ వీణ , సినిమా** : ప్రస్తుతం పాన్ ఇండియా చిత్రాలు, విజువల్ వండర్ మూవీస్‌ను తెరకెక్కించేందుకు దర్శక నిర్మాతలు మక్కువ చూపుతున్నారు. రెగ్యులర్ లవ్, మాస్ కమర్షియల్ చిత్రాల కంటే.. ఓ తెలియని ప్రపంచాన్ని సృష్టించి.. అద్భుతమైన విజన్‌తో ఆడియెన్స్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక మన ఇండియన్ మైథాలజీ మీద ఎన్ని సినిమాలు వచ్చినా ఆడియెన్స్ ఆదరిస్తూనే ఉంటారు. ఈ క్రమంలోనే విష్ణు మంచు కన్నప్ప సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నాడు. కన్నప్ప కోసం మంచు విష్ణు భారీగానే కష్టపడుతున్న సంగతి తెలిసిందే. కన్నప్ప షూటింగ్ మొత్తం కూడా దాదాపు న్యూజిలాండ్, అక్కడి పరిసర ప్రాంతాల్లోనే జరుగనున్నట్టుగా కనిపిస్తోంది. ఆల్రెడీ ఫస్ట్ షెడ్యూల్‌ను సక్సెస్ ఫుల్‌గా పూర్తి చేసుకుని వచ్చారు. అక్కడ 90 రోజుల పాటు నిర్విరామంగా షూట్ చేశారు. ఈ క్రమంలో మంచు విష్ణుకి, డ్యాన్స్ కొరియోగ్రఫర్‌కు గాయాలైన సంగతి తెలిసిందే. ఎన్ని గాయాలైనా కూడా షూటింగ్‌కు మాత్రం బ్రేక్ ఇవ్వలేదు. అలా విష్ణు మంచు కన్నప్ప మూవీని చేస్తూనే ఉన్నాడు.ప్రస్తుతం కన్నప్ప టీం న్యూజిలాండ్‌కు వెళ్లింది. రెండో షెడ్యూల్ కోసం విష్ణు మంచు, మోహన్ బాబు అక్కడ ల్యాండ్ అయ్యారు. కన్నప్ప చిత్రంలో మోహన్ లాల్, ప్రభాస్, శరత్ కుమార్, బ్రహ్మానందం వంటి వారు నటిస్తున్న సంగతి తెలిసిందే. శివ బాలాజీ, సురేఖా వాణి వంటి వారు కూడా ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ మూవీని దసరాకు విడుదల చేయాలనే ప్లాన్‌లో ఉన్నారన్న విషయం తెలిసిందే.




మహా భారతం సీరియల్‌ను తీసిన ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి హాలీవుడ్ సినిమాటోగ్రఫర్ షెల్డన్ చౌ పని చేస్తున్నారు. పాన్ ఇండియా వైడ్‌గా రాబోతోన్న ఈ చిత్రాన్ని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ల మీద మోహన్ బాబు నిర్మిస్తున్నారు.